క్లుప్తంగా

తిప్పన్న తాత ఉత్సవాలు ప్రారంభం


చిగిళిలో వెలసిన కట్టెల తిప్పన్న తాత

ఆస్పరి: మండలంలోని చిగిళిలో వెలసిన శ్రీగిరి కట్టెల తిప్పన్న తాత ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో తిప్పన్న తాతకు గంగ, ఆకుపూజ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం ప్రభోత్సవం, ప్రత్యేక పూజలు, సాయంత్రం రథోత్సవం, శనివారం వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని గ్రామ పెద్దలు చెప్పారు.

ఓటర్లకు ఇబ్బందులు తలెత్తనీయొద్దు


మద్దికెరలో అధికారులకు సూచనలిస్తున్న ఎన్నికల జనరల్ అబ్జర్వర్

తుగ్గలి/మద్దికెర/ కృష్ణగిరి: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మీర్ తారీక్ ఆలీ అధికారులను ఆదేశించారు. గురువారం తుగ్గలి, ఎద్దులదొడ్డి, శభాష్‌పురం, మద్దికెర, వెల్దుర్తి, చెరుకులపాడు, మల్లెపల్లె, అల్లుగుండు గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, లైట్లు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ఆరా తీశారు. ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఆయన వెంట తుగ్గలి, మద్దికెర, వెల్దుర్తి తహసీల్దార్లు షర్మిల, రజాక్‌వలి, అనంతాచారి, మద్దికెర, వెల్దుర్తి ఎంపీడీఓలు అలివేలమ్మ, శివశంకరప్ప తదితరులు ఉన్నారు.

టీడీపీ చీప్ ట్రిక్స్

- సొంత పార్టీ వారికే కండువాలు వేసి ఇతర పార్టీల నుంచి వస్తున్నారంటూ ప్రచారం

తుగ్గలి: టీడీపీ చీప్ ట్రిక్స్ ప్లే చేస్తోందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జిట్టా నాగేష్‌యాదవ్ విమర్శించారు. గురువారం ఆయన మాట్లాడుతూ మారెళ్లలో టీడీపీ సర్పంచ్ మద్దతుదారునిగా పోటీ చేసి ఓడి పోయిన వారి బంధువులకే టీడీపీ కేఈ శ్యాంబాబు పచ్చ కండువాలు వేసి వైఎస్సార్‌సీపీ వారు తమ పార్టీలో చేరారని ప్రచారం చేసుకోవడంతో జనం నవ్వుకుంటున్నారన్నారు. గతంలో ఇచ్చిన హామీలు చంద్రబాబు ఏ ఒక్కటీ నెరవేర్చలేదు. మోసపూరిత చంద్రబాబు మేనిఫేస్టోను జనాలు నమ్మడం లేదని తెలిపోవడంతో ఆ పార్టీ నాయకులు ఇలాంటి చీప్ ట్రిక్స్‌కు పాల్పడుతున్నారన్నారు. వారెన్ని కుయుక్తులు పన్నినా ఎన్నికల్లో టీడీపీకి ఓటమి తప్పదని, పత్తికొండలో వైఎస్సార్‌సీపీ జెండాఎగరడం ఖాయమని జిట్టా నాగేష్ యాదవ్ అన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

హాలహర్వి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆంథోని తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరుకావాలన్నారు. అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో రావాలన్నారు. తాగునీరు, ఉపాధి కూలీల తదితర అత్యవసర సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

కంగాటి శ్రీదేవి ప్రచారం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంగాటి శ్రీదేవి శుక్రవారం ఉదయం బింగిదొడ్డి, గుంటుపల్లె, శ్రీరంగాపురం గ్రామాల్లో, సాయంత్రం పుల్లగుమ్మి, రామళ్లకోట, కలుగొట్ల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి తెలిపారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని ఆయన కోరారు.

ఓటర్లకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

ఆలూరు: ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పిస్తామని ఆలూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ డి.రామునాయక్ తెలిపారు. గురువారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడారు. దివ్యాంగులు, వృద్ధులు, నడవలేని వారి కోసం నియోజకవర్గ వ్యాప్తంగా 176 ట్రై సైకిళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

5న నవ్వుల దినోత్సవం

కర్నూలు(హాస్పిటల్): ఈ నెల 5న ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్ క్లబ్‌లో ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లాఫ్ థెరపిస్టు, హ్యాపీ లైఫ్ కోచ్ సి.సలీమ్‌బాషా నవ్వుల వల్ల ఉపయోగాలను వివరిస్తారన్నారు.

ఆశీర్వదించండి..అభివృద్ధి చేస్తా

- వైఎస్సార్‌సీపీ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి


అమకతాడులో పర్యటిస్తున్న పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి

కృష్ణగిరి, వెల్దుర్తి(కృష్ణగిరి): మరోసారి తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని వైఎస్సార్‌సీపీ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం ఆమె కృష్ణగిరి మండలం అమకతాడు, ఎస్‌హెచ్ ఎర్రగుడి, వెల్దుర్తి మండలం అల్లుగుండు, సూదేపల్లె, బోగోలు, చెర్లకొత్తూరు, గోవర్ధనగిరి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఆమెకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తనను మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిపించినప్పుడు అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీటి వసతి, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయించానని ప్రజలకు వివరించారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి గ్రామానికి ఆసుపత్రులు, సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌లు, వాటర్ ట్యాంకులు, తదితర అభివృద్ధి పనులు జరిగాయన్నారు. సూదేపల్లె, గోవర్ధనగిరి, బోగోలు చెరువులు నిండి ఉన్నాయంటే తాము హంద్రీనీవా కాలువ నుంచి చెరువులకు నీరు నింపడంతోనేనన్నారు. చంద్రబాబు మేనిఫెస్టో అబద్ధాలతో నిండి ఉందన్నారు. 2014లో హామీలిచ్చి మోసం చేసిన మేనిఫెస్టోతోనే మరోసారి వస్తున్నారని, ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దన్నారు. ఓటుతోనే తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు ఆమె సూచించారు. ప్రజలకు సేవ చేయడం తన భర్త దివంగత చెరుకులపాడు నారాయణరెడ్డి నుంచి నేర్చుకున్నానని, ఆయన ఆశయ సాధనలో, సీఎం జగనన్న పాలనలో సేవ చేసేందుకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈనెల 13న రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి కర్నూలు ఎంపీగా బీవై రామయ్యను, పత్తికొండ ఎమ్మెల్యేగా తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్‌కుమార్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ కోట్ల, కేఈ కుటుంబాలు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వందల కుటుంబాలను ఫ్యాక్షన్‌కు బలిచేశాయని విమర్శించారు. అలాంటి వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. ప్రచారంలో పార్టీ బీసీ విభాగం రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య, కృష్ణగిరి ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి, కంగాటి రామ్మోహన్ రెడ్డి, వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల కన్వీనర్లు బొమ్మన రవిరెడ్డి, ఆర్బీ వెంకట్రాముడు, జెడ్పీటీసీలు కేఈ సుభాషిణి, సుంకన్న, వెల్దుర్తి సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ సమీర్ కుమార్ రెడ్డి, అల్లుగుండు శ్రీరాంరెడ్డి, సూదేపల్లె వెంకటేశ్వరరెడ్డి, శరభారెడ్డి, సర్పంచ్ బాలకృష్ణ, చెర్లకొత్తూరు గంగాధర్, సీతారామయ్య, వైస్ ఎంపీపీ రంగడు, గోవర్ధనగిరి సర్పంచ్ ఎల్లరాముడు, అమకతాడు సర్పంచ్ బోయ సర్వేశ్వరి, కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, బాల మిన్నల్ల, ఎస్‌హెచ్ ఎర్రగుడి సర్పంచ్ గిరిబాబు, రాజశేఖర్ రెడ్డి, మూలింటి మాదన్న, చంద్రారెడ్డి, శివ పాల్గొన్నారు.

బోయబొంత రాళ్ల గ్రామంలో..

కృష్ణగిరి: మండల పరిధిలోని బోయబొంత రాళ్ల గ్రామంలో గురువారం మండల కన్వీనర్ ఆర్బీ వెంకట్రాముడుతో కలిసి ఎంపీపీ కంగాటి వెంకట్రామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కేఈ సుభాషిణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తుంచుకుని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో నాయకులు నవీనపాటి, హనుమంత రెడ్డి, కృష్ణారెడ్డి, లింగప్ప, కృష్ణమూర్తి, రామాంజనేయులు, బోయ రంగనాయకులు పాల్గొన్నారు.


అల్లుగుండులో మాట్లాడుతున్న కంగాటి శ్రీదేవి


పి.కొత్తూరులో ఓట్లు అభ్యర్థిస్తున్న జగన్నాథరెడ్డి

తుగ్గలి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంగాటి శ్రీదేవి, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యను గెలిపించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథరెడ్డి, శ్రీదేవి కుటుంబ సభ్యులు మధుసూదన్ రెడ్డి, మణిదీప్‌రెడ్డి, రమ్య, సంధ్య గురువారం పీ.కొత్తూరులో ఇంటింట ప్రచారం నిర్వహించారు.


ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మద్దికెర: మండల పరిధిలోని బసినేపల్లి, మదనంతపురం గ్రామాల్లో జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ భద్రయ్య, నాయకులు శివారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా కంగాటి శ్రీదేవిని, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని కోరారు. ప్రచారంలో నాయకులు ప్రతాప్, చౌడప్ప, కావలినాగేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కంగాటి శ్రీదేవి, బీవై రామయ్యలను గెలిపించాలని కోరుతూ గురువారం పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్‌తో కలిసి జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్ సూర్యతండా, బాటతండా, మీటేతండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దళారుల ప్రమేయం లేకుండా పేదలకు నేరుగా ఇంటికే సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌కే దక్కిందని, పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్ననే ముఖ్యమంత్రిగా ఎన్నుకుందామని వారు ప్రజలకు సూచించారు. ప్రచారంలో నాయకులు బాబునాయక్, రామనాయక్, కృష్ణానాయక్, స్వామినాయక్, జగదీష్‌నాయక్ పాల్గొన్నారు.


సూర్యతండాలో ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్

సంక్షేమ ప్రభుత్వానికి పట్టం కట్టండి


ఓటు వేయాలని కోరుతున్న విరూపాక్షి

- వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి బుసినే విరూపాక్షి

దేవనకొండ: మరోసారి సంక్షేమ ప్రభుత్వానికి పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి బుసినే విరూపాక్షి ప్రజలను కోరారు. గురువారం మండలంలోని బంటుపల్లి, చెల్లిచెలిమల, బేతపల్లి, పి.కోటకొండ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలకు అభివాదం చేస్తూ సీఎం జగనన్న మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవడానికి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని వారు కోరారు. మోసపూరిత హామీలతో టీడీపీ నాయకులు వచ్చినా నమ్మొద్దని, టీడీపీ గెలిస్తే పథకాలు ఆగిపోతాయని వివరించారు.2014లో చంద్రబాబు అధికారంలోకి రావడానికి అనేక అబద్ధపు హామీలిచ్చారని, డ్వాక్రా మహిళలు, రైతన్నలకు రుణమాఫీ చేస్తానని మోసం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ ఆలూరు అసెంబ్లీ ఎన్నికల అబ్జర్వర్ సురేంద్రరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, పార్టీ బీసీ విభాగం రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య, నాయకులు కోట్ల హరిచక్రపాణిరెడ్డి, మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు, జేసీఎస్ మండల కన్వీనర్ రాజారెడ్డి, కో-కన్వీనర్ కబీర్‌దాసు, బంటుపల్లి సర్పంచ్ ప్రకాష్, దివాకర్‌నాయుడు, ఉమాంబ, హనుమంతరెడ్డి, నిజాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రేమనాథ్‌రెడ్డి, చిన్నకొలుట్ల తదితరులు పాల్గొన్నారు.


బేతపల్లిలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, పక్కన ఆలూరు అభ్యర్థి విరూపాక్షి

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి

చిప్పగిరి: ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు మారయ్య ప్రజలను కోరారు. గురువారం మండలంలోని కుందనగుర్తి, బెల్దోణ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టో పత్రాలను పంపిణీ చేసి, ఫ్యాన్ గుర్తుపై ఓటేసి బుసినే విరూపాక్షిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ప్రచారంలో నాయకులు సత్తిరెడ్డి, రామాంజనమ్మ, శేఖర్, ప్రేమ్‌కుమార్, మల్లికార్జున, నాగరాజు, లింగన్న, సుంకన్న, గోవిందారాజులు, ధర్మేంద్ర, సురేష్ రెడ్డి, శేషి రెడ్డి పాల్గొన్నారు.

ద్రోహం చేసే సంస్కృతి మీది

చిప్పగిరి: పదవులిచ్చిన వైఎస్సార్‌సీపీకి మోసం చేసి ద్రోహం చేసిన సంస్కృతి గుమ్మనూరు సోదరులదేనని మండల పరిధిలోని సర్పంచులు గోవిందరాజులు, ప్రేమ్ కుమార్, ఎంపీటీసీ సభ్యుడు సుంకన్న విమర్శించారు. ఇటీవల దౌల్తాపురంలో టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ చేసిన వ్యాఖ్యలను గురువారం కుందనగుర్తిలో వారు ఖండించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భిక్ష వల్ల పైకొచ్చి, సొంతంగా ఎదిగామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. విరూపాక్షి మంచి తనం చూసి జగనన్న ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చారన్నారు. సమావేశంలో నాయకులు శేఖర్, ధర్మేంద్ర, నాగరాజు, లింగన్న, సత్తిరెడ్డి, ఓలయ్య, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు

ఏడి‘పింఛెన్’

- అవ్వాతాతలకు తప్పని పింఛన్ కష్టాలు అవస్థలు
- సచివాలయాలకు వెళ్లాలో.. బ్యాంకులకు వెళ్లాలో తెలియక సతమతం
- కొందరి అకౌంట్లు మనుగడలో లేక ఈకేవైసీ కోసం బ్యాంకుల వద్ద బారులు

సాక్షి నెట్ వర్క్: పింఛన్‌దారులు గురువారం అల్లాడిపోయారు. గతంలో ఒకటో తేదీ వచ్చిందంటే వారికి పండుగలా ఉండేది. వేకువ జామునే వలంటీర్ ద్వారా పింఛన్ సొమ్ము చేతికి అందేది. అవ్వాతాతల ముఖాల్లో అయితే ఆనందం వికసించేది. నెలంతా వారి మందులు, ఇతర ఖర్చులకు ఎవరి దగ్గరా చేయి చాపాల్సిన అవసరం ఉండేది కాదు. టీడీపీ నాయకులు కుట్ర రాజకీయాలతో గత నెల నుంచి వలంటీర్లను పింఛన్ల పంపిణీకి దూరం పెట్టడంతో కష్టాలు మొదలయ్యాయి. ఈనెల అయితే మరింత ఇబ్బంది పడ్డారు. వృద్ధులు, వితంతువులకు బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని ప్రకటించడంతో వారు ఎండల్లో పల్లెల నుంచి మండల కేంద్రాల్లోని బ్యాంకులు, కస్టమర్ సెంటర్లకు కష్టకష్టాలు పడుతూ వెళ్లారు. తీరా అకౌంట్లు మనుగడలో లేక, బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ లేక ఈకేవైసీ కాక వాటిని సరి చేసుకునేందుకు ఫారాలు పట్టుకుని గంటల తరబడి బారులు తీరారు. పలువురు పింఛన్‌దారులకు సహాయకులు లేక ఇబ్బంది పడ్డారు. కొందరి అకౌంట్లు మైనస్ బ్యాలెన్స్ ఉండడంతో రూ.200 నుంచి రూ.300 వరకు ఖాతాల్లోని నగదు బ్యాంకు వారు తీసుకోవడంతో వృద్ధులు నిరాశ చెందుతున్నారు. ఈ పరిస్థితికి కారణమైన టీడీపీపై మండిపడుతున్నారు. ఈ వయసులో తమను కష్టాలపాలు చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఆధార్ లింకు, అకౌంట్ అప్‌డేట్ కోసం ఆలూరు స్టేట్ బ్యాంకు వద్ద బారులు తీరిన వృద్ధులు

అవస్థలు పడుతున్నాం



ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ ఇంటికే వచ్చి పింఛన్ అందించేవాడు. గత నెల నుంచి వలంటీర్ రావడం లేదు. ఆ నెల సచివాలయం వద్ద పింఛన్ తీసుకున్నా. ఈసారి సచివాలయం వద్దకు వెళ్తే బ్యాంకు అకౌంట్‌కు వేశారని చెప్పారు. బాంక్ కస్టమర్ సర్వీస్ సెంటర్‌కు వెళ్తే అకౌంట్‌కు ఆధార్ లింకు లేదన్నారు. మధ్యాహ్నం వరకు ఆధార్ లింక్ కోసం వరుసలో నిలబడాల్సి వచ్చింది.– లక్ష్మీబాయి, అరికెర తండా

కాళ్లు ఈడ్చుకుంటూ వచ్చా



నడిచేందుకు చేత కాదు. ఐదేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నాను. ప్రతి నెల 1వ తేదీ ఇంటి వద్దకే వచ్చి ఇచ్చేవారు. రెండు నెలలుగా పింఛన్ తీసుకోడానికి ఇబ్బందులు పడుతున్నాను. ఎండకు నిలవలేక దప్పికతో అల్లాడిపోతున్నాను. మళ్లీ జగన్ సీఎం అయితే మాలాంటోళ్లకు మేలు.
– గుండాల శ్రీరాములు, మద్దికెర


ఆస్పరి ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రం వద్ద వేచి ఉన్న పింఛన్‌దారులు


హాలహర్వి బ్యాంకు వద్ద వేచి ఉన్న పింఛన్‌దారులు


మద్దికెర బ్యాంకు వద్ద క్యూలో నిల్చున్న లబ్ధిదారులు

బ్యాంకు ఖాతా లేదు



నాభర్త పోయి 35 ఏళ్లయింది. రూ.30 నుంచి పింఛన్ తీసుకుంటున్నా. సచివాలయానికి వెళ్తా పింఛన్ బ్యాంకులో వేస్తారని చెప్పారు. నాకు బ్యాంకు ఖాతానే లేదు. ఏం చేయాలో తోచడం లేదు. నా పింఛన్ నాకు ఇప్పించండి. నా స్వంత ఖర్చులు, మందులకు ఇబ్బంది అవుతుంది. ఈ చంద్రబాబు మాలాంటోళ్ల శాపంతో పాపం మూటకట్టుకుంటున్నాడు.
– కేదారి మల్లమ్మ, అల్లుగుండు గ్రామం, వెల్దుర్తి మండలం

మా ఉసురు తగులుతుంది



చంద్రబాబునాయుడు చేసిన పని వల్ల నేను మా గ్రామం నుంచి 20 కి.మీ. దూరంలో ఉన్న హాలహర్వి బ్యాంకుకు వచ్చి డబ్బు తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. రెండు నెలలుగా పింఛన్ తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఏప్రిల్ నెలలో సచివాలయాల వద్ద లైన్‌లో నిలబడి ఇబ్బంది పడ్డాం. ఇప్పుడేమో బ్యాంకు చుట్టూ తిరగాల్సి వచ్చింది. ఈ పరిస్థితికి కారణమైన చంద్రబాబుకు మా ఉసురు తగులుతుంది. – శేషమ్మ, సిద్ధాపురం గ్రామం

కొనసాగుతున్న చేరికలు


ఎరుకులచెరువు టీడీపీ నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీదేవి


బి.ఎర్రబాడు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరిన దృశ్యం

కృష్ణగిరి: వైఎస్సార్‌సీపీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. మండలంలోని బి.ఎర్రబాడు, ఎరుకలచెరువు గ్రామాల నుంచి టీడీపీకి చెందిన 80 కుటుంబాలు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి, జెడ్పీటీసీ కేఈ సుభాషిణి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి కంగాటి శ్రీదేవి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలో చేరుతున్నట్లు బి.ఎర్రబాడు గ్రామానికి చెందిన బోయ వెంకటేశ్, బోయ జయరాముడు, కురువ రామదాస్, కురువ మోహన్, గొర్ల అయ్యన్న, ఆటో సుధాకర్, ఆకుల బాలు, గొర్రెల చిన్న అయ్యన్న, బోయ సురేశ్, కుమార్, కోడుమూరు మధు, అమడగుంట్ల గిడ్డయ్య, బోయ స్వామి తదితరులు తెలిపారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ ఫలాలు అందుతుండడటంతో వైఎస్సార్‌సీపీలో చేరామని ఎరుకుల చెరువు గ్రామానికి చెందిన ట్రాక్టర్ గిడ్డయ్య, చిన్న గిడ్డయ్య, బోయ మద్దయ్య, బాలు, సురేంద్ర, గిరి, సురేశ్, రంగడు, జిలేబి గిడ్డయ్య, వడ్డె రాముడు, బంగారప్ప, మాదిగ సురేశ్ తదితరులు తెలిపారు. కంగాటి శ్రీదేవి చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరామని కోయిలకొండ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ కుమారుడు గంగాధర్ తెలిపారు. కార్యక్రమంలో పోతుగలు, ఎరుకలచెరువు నాయకులు నారాయణరెడ్డి, వెంకటేశ్, రామకృష్ణ, మద్దిలేటి, నాగరాజు, వెంకట్రాముడు పాల్గొన్నారు.

హొళగుందలో..

ఆలూరు: హొళగుంద మండల కేంద్రానికి చెందిన కళ్లి కుటుంబ సభ్యులు గురువారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి పార్టీ మండల కన్వీనర్ షఫిఉల్లా, నాయకులు బుసినే శ్రీరాములు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. జగనన్న సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలో చేరుతున్నట్లు పెద్ద నాగప్ప, మారేషి, తిక్కన్న, బాపురం రామాంజనేయులు, కరచేడు లక్ష్మన్న, సింధవాళం మారెన్న తదితరులు తెలిపారు. ఈ సందర్భంగా బుసినే శ్రీరాములు, షఫిఉల్లా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం శ్రీరాములు నెరణికి, తండా, కొత్తపేట వివిధ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుసి నే విరుపాక్షి,కర్నూల్ వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య గెలిం చుకో వాలంటే అందుకు ఫ్యాన్ గుర్తును ఓటు వేయాలని కరపత్రాల ద్వారా ఇంటింటా ప్రచారం చేశారు.


టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరుతున్న కళ్లి కుటుంబ సభ్యులు